
సాక్షి
ఖమ్మం
సోమవారం । 29 । జూలై । 2024



నాలుగు నెలలు నష్టమే..

గోదావరి భద్రాచలం ఏజెన్సీ వాసులకు మాత్రం 'కడగండ్ల'ను మిగుల్చుతోంది. రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. 10లో



'రాయల' జీవితం ఆదర్శప్రాయం

పేదల అభ్యున్నతి కోసం ఉద్యమించిన చంద్రశేఖర్ జీవితం ఆదర్శనీయమని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం రోజంతా మబ్బులు పడతాయి. మధ్యాహ్నం తర్వాత జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం



నిర్వాహకుల చేతుల మీదుగా బంగారు పతకం తీసుకున్న సింధుప్రియ

తల్లాడ: గోవాలో జరిగిన 18వ జాతీయ స్థాయి యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ గేమ్స్ చాంపియన్ షిప్ పోటీల్లో తల్లాడ మండలం రగంబంజర గ్రామానికి చెందిన గిరిజన బాలిక దర్మసోత్ సింధుప్రియ బంగారు పతకం సాధించింది. ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలో బీజెడ్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సింధుప్రియ.. ఈనెల 25న గోవాలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో అద్భుత ప్రతిభ చాటింది. బంగారు పతకంతో పాటు నేపాల్‌లో సెప్టెంబర్ 1 నుంచి 6వరకు జరిగే నేషనల్ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ ఇండియా తరఫున పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ ఇండియా తరఫున వెళ్లే పరుగు పందెంలో కూడా బంగారు పతకం సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది.

జిల్లాకు 25 మంది శిక్షణ అధికారులు

నేలకొండపల్లి: కేంద్ర సర్వీసుల్లోని ఉన్నతాధికారులు గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ, అధ్యయనం నిమిత్తం జిల్లాకు రానున్నారు. ఈమేరకు 25 మంది ఐఆర్‌ఎస్ అధికారులు ఐదు బృందాలుగా ఐదు గ్రామాల్లో పర్యటిస్తారు. నేటి నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు గ్రామపంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల పాలనా వ్యవహారాలు, ఉపాధి హామీ పనులు, డంపింగ్ యార్డ్‌ల నిర్వహణ, పంటల సాగు తదితర అంశాలపై అధ్యయనం చేయనున్నారు. నేలకొండపల్లి మండలం నాచేపల్లి, ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెం, మధిర మండలం కంబంపాడు, ఏన్కూరు మండలం నాచారం, కల్లూరు మండలం కొర్లగూడెంలో బృందాలు పర్యటించనుండగా, జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీపీఓ హరికృష్ణ పర్యవేక్షిస్తారు.

ఈజీఎస్ ద్వారా పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం

ఉత్తర్వులు జారీ చేసిన గ్రామీణాభివృద్ధి శాఖ

ఖమ్మంఅర్బన్: టాయిలెట్లు లేని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. టాయిలెట్లు అవసరమైన పాఠశాలలను గుర్తించాలని, ఒకవేళ ఉన్నా దెబ్బతింటే వాటి స్థానంలో నూతనంగా నిర్మించాలని సిబ్బందికి సూచించింది. ఒక్కో పాఠశాలలో రూ. 2 లక్షలకు మించకుండా ఖర్చు చేయాలని పేర్కొంది. ఈ మేరకు నూతన డిజైన్లతో కూడిన మ్యాప్‌ను అధికారులు విడుదల చేశారు. దీంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మరుగుదొడ్లు అవసరమైన పాఠశాలలను గుర్తించి కలెక్టర్ అనుమతితో నూతన నిర్మాణాలు చేపట్టనున్నారు.

24 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు !

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో అక్రమ పద్ధతిలో బదిలీ అయిన 24 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. జిల్లాలో ఇటీవల బదిలీలు జరగగా.. అందులో భార్యాభర్తలిద్దరూ స్పౌజ్‌ను ఉపయోగించుకున్నారు. అయితే భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో ఆప్షన్లు ఇచ్చుకుని బదిలీ కావాల్సి ఉండగా.. ఒకరు సుదూర మండలంలో ఉంటే మరొకరు ఖమ్మం నగరం, సమీప ప్రాంతాలకు బదిలీపై వచ్చినట్లు సమాచారం. వీటిపై ఫిర్యాదులు రావడంతో డీఈఓ షోకాజ్ నోటీసులిచ్చారు. దీనిపై డీఈఓ సోమశేఖర శర్మను వివరణ కోరగా.. నాలుగు రోజుల క్రితం షోకాజ్ నోటీసులు ఇచ్చామని, వారిచ్చే వివరణ ఆధారంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా షోకాజ్ నోటీసులిచ్చిన విషయాన్ని విద్యాశాఖ రహస్యంగా ఉంచడం.. మరో వైపు ఓ ఉపాధ్యాయ సంఘం వారు అక్రమ బదిలీలు జరిగాయని ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో షోకాజ్ నోటీసులు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి చిత్రకూట మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.



మార్కెట్ పీఠంపై నజర్

నామినేటెడ్ పదవుల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం వేగం పెంచింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులకు సంబంధించి జీఓలు విడుదల చేయగా.. ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురికి పదవులు దక్కాయి. ఇక జిల్లా స్థాయిలో మార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామకానికి ఆయా నియోజకవర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో కూర్పు జరుగుతోంది. తాజాగా సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ కమిటీల చైర్మన్ల పేర్లను ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రతిపాదించగా ప్రభుత్వం జిల్లా మార్కెటింగ్ శాఖ పరిశీలనకు పంపింది. ప్రస్తుతం ఆ శాఖ పరిశీలిస్తోంది. ఈ క్రమంలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకులు మళ్లీ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

కమిటీల కూర్పునకు ప్రభుత్వం కసరత్తు

- మంత్రులను ఆశ్రయిస్తున్న ఆశావహులు
- సత్తుపల్లి, కల్లూరు కమిటీలను ప్రతిపాదించిన ఎమ్మెల్యే
- మార్కెటింగ్ శాఖ పరిశీలనలో ఆ రెండు..
- ఉమ్మడి జిల్లాలో 14 వ్యవసాయ మార్కెట్లు

రిజర్వేషన్ విధానం అమలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 14 వ్యవసాయ మార్కెట్లు ఉండగా.. నూతనంగా చింతకాని, ముదిగొండల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లకు రిజర్వేషన్ ప్రాతిపదికన కమిటీల నియామకం చేపట్టింది. ప్రతి మార్కెట్‌లో 14మంది పాలకవర్గ సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. అందులో మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలతో పాటు ఇద్దరు వ్యాపారులు ఉండాలి. చైర్మన్ పదవికి కూడా రిజర్వేషన్ విధానాన్ని అమలు చేసింది. ఈ కమిటీల పదవీ కాలం ఒక ఏడాదిగా నిర్ణయించింది. పాలకవర్గం పనితీరు బాగుంటే 6 నెలల చొప్పున రెండుసార్లు పొడిగించే వీలు కల్పించింది. ఆ తర్వాత పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచి.. 6 నెలల చొప్పున రెండుసార్లు పొడిగించే వెసులుబాటు కల్పించింది. అయితే రిజర్వేషన్ పద్ధతి అమలుతో కొన్ని వ్యవసాయ మార్కెట్లు పాలకవర్గాలు లేక ఖాళీగా ఉన్నాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కమిటీల ఏర్పాటుకు అనువుగా ఉండేందుకు ఉన్న కమిటీలనూ రద్దు చేసింది.

కోర్టును ఆశ్రయించిన ఆదివాసీలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏజెన్సీలో ఉన్న మార్కెట్ కమిటీ పదవులను పీసా చట్టం ప్రకారం తమకే కట్టబెట్టాలని కొందరు ఆదివాసీలు కోర్టును ఆశ్రయించారు. ఇక ఏజెన్సీలోని మార్కెట్ కమిటీలను పూర్తి స్థాయిలో గిరిజనులు, ఆదివాసీలకే కేటాయించాలనే డిమాండ్‌తో అక్కడ పాలకవర్గాల నియామకం జరగడం లేదు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మైదాన ప్రాంతంలోని ఎనిమిది మార్కెట్ కమిటీలకే పాలకవర్గాలను నియమిస్తుందా.. లేక ఏజెన్సీలోని ఆరు మార్కెట్ కమిటీల నియామకం కూడా చేపడుతుందా..? అనే చర్చ జరుగుతోంది.

రెండు కమిటీలకు ప్రతిపాదనలు..

ఖమ్మం జిల్లాలో రెండు మార్కెట్ కమిటీల నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయి. సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎస్సీ కేటగిరీకి చెందిన బి.ఆనందబాబు, కల్లూరు నుంచి జనరల్ మహిళ బి.నీరజ పేర్లను ప్రతిపాదిస్తూ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రభుత్వానికి పంపారు. వీటిని ప్రభుత్వం జిల్లా మార్కెటింగ్ శాఖ పరిశీలనకు పంపించింది. పరిశీలన అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌తోపాటు పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయనుంది. మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు పంపుతారనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలోని స్థానిక నేతలు శాసనసభ్యులను కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కొందరు నేతలు తమ అనుంగు నేతలను కలిసి తమకు పదవి ఇప్పించాలని కోరుతున్నారు. చాలామంది నాయకులు పార్టీ గెలుపులో తాము కీలక పాత్ర పోషించామంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావును ఆశ్రయిస్తున్నారు. తాము పార్టీకి చేసిన సేవలను గుర్తించి నామినేటెడ్ పదవులు కట్టబెట్టాలని కోరుతున్నారు.

'మైదానం'లో ఎనిమిది.. ఏజెన్సీలో ఆరు..

ఉమ్మడి జిల్లాలో 14 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా.. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మద్దులపల్లి, నేలకొండపల్లి, మధిర, వైరా, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్లు.. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, దమ్మపేట, భద్రాచలం, చర్ల వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. వీటిలో ఖమ్మం, నేలకొండపల్లి, మధిర, వైరా, కల్లూరు, సత్తుపల్లి, మద్దులపల్లి, కొత్తగూడెం మార్కెట్లు మైదాన ప్రాంతంలో ఉండగా.. ఏన్కూ రు, ఇల్లెందు, దమ్మపేట, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల మార్కెట్లు ఏజెన్సీలో ఉన్నాయి. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న మార్కెట్లకు పాలకవర్గాల నియామకం అయోమయంలో ఉంది.

శాంతించిన గోదావరి



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- మూడో, రెండో ప్రమాద హెచ్చరికల ఉపసంహరణ
- ముంపు కాలనీలు, స్లూయిజ్‌లను పరిశీలించిన పీఓ, ఏఎస్పీ

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి శాంతిస్తోంది. ఎగువ ప్రాంతాలతోపాటు తాలిపేరు నుంచి వరద నీరు లేకపోవడంతో ప్రవాహం తగ్గుముఖం పట్టింది. దీంతో ఆదివారమే మూడో, రెండో ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించారు. ఇక పట్టణంలోని స్లూయిజ్‌ల నుంచి వరద నీరు మళ్లీ లీకడంతో కొన్ని కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఉగ్రరూపం దాల్చిన గోదావరి శనివారం రాత్రి 53.60 అడుగులకు చేరుకుని, అర్ధరాత్రి తర్వాత శాంతించింది. కొన్ని గంటల పాటు ప్రవాహం నిలకడగా కొనసాగగా, అనంతరం తగ్గుముఖం పట్టింది. ఉదయం 6 గంటల తర్వాత 53 అడుగులకు తగ్గటంతో మూడో, రాత్రి 8.46 గంటలకు 47.8 అడుగులకు దిగువన ప్రవహించటంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. రాత్రి 11 గంటలకు వరద 47.20 అడుగులకు తగ్గిపోగా, 11,08,154 క్యూసెక్కుల జలాలు దిగువకు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. తాలిపేరు నుంచి 25 గేట్లను ఎత్తి 25 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

పునరావాస శిబిరాల్లోనే ముంపు కాలనీ వాసులు

భద్రాచలంలోని నన్నపనేని మోహన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలోనే ఇంకా కాలనీ వాసులు ఉన్నారు. ఆదివారం సైతం ఏఎంసీ కాలనీకి ఎగువ భాగాన ఉన్న స్లూయిజ్‌ల లీకేజీతోపాటు పట్టణంలోని మురుగునీరు భారీగా చేరటంతో ఏఎంసీ కాలనీ, అశోక్ నగర్ కాలనీలోని పలు ఇళ్లలోకి చేరింది. దీంతో గోదావరి తగ్గినా ఆ కాలనీకి చెందిన 106 కుటుంబాలు ఇంకా పునరావాస శిబిరంలో ఉన్నాయి. కాగా శిబిరంలో ఆహారం సరిగా ఉడకలేదంటూ కాలనీవాసులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్లూయిజ్‌ను గాలికొదిలేసిన అధికారులు

స్లూయిజ్‌ల పటిష్టత, నిర్వహణలో ఇరిగేషన్ అధికారుల అలసత్వం మరోమారు వెల్లడైంది. జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతోపాటు కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌లు స్లూయిజ్‌లను పటిష్టపర్చి మోటార్లను సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు సమీక్ష సమావేశాల్లో సూచనలు చేశారు. విస్తా కాంప్లెక్స్ తోపాటు మరికొన్ని చోట్ల మోటార్లను ఏర్పాటు చేసిన అధికారులు ఏపీ బోర్డర్‌లో ఉన్న స్లూయిజ్‌ను గాలికొదిలేశారు. పనిచేయని మోటార్ల ఏర్పాటుతో ఏఎంసీ, అశోక్‌నగర్ కొత్తకాలనీలను వరద నీరు చుట్టుముట్టింది.

పూర్తిగా తగ్గేవరకు శిబిరాల్లోనే ఉండాలి

గోదావరి వరద పూర్తిగా తగ్గే వరకు ముంపు కాలనీవాసులను పునరావాస శిబిరాల్లోనే ఉంచాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. ఆదివారం ఆయన ఏఎస్పీ అంకిత్‌కుమార్‌తో కలిసి వరద ముంపునకు గురైన పట్టణంలోని కొత్త కాలనీ, విస్తా కాంప్లెక్స్‌లోని స్లూయిజ్ పాయింట్లను, అక్కడ నుంచి గోదావరిలోకి వరద నీరు వెళ్లే మార్గాలను సందర్శించి పరిశీలించారు. వరద తగ్గుతున్నా నిర్లక్ష్యం వహించొద్దని, స్లూయిజ్‌ల వద్ద మోటార్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వరద ముంపు వైపు, కరకట్ట వైపు సందర్శకులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు తెలిపారు. వరద పూర్తిస్థాయిలో తగ్గి కాలనీలను శుభ్రం చేశాకే ఇళ్లకు వెళ్లాలని బాధితులకు సూచించారు. అధికారులు మస్తాన్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాలిపేరుకు తగ్గిన వరద

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి తగ్గుతోంది. ఆదివారం రాత్రి 7 గంటలకు 25 గేట్లను ఎత్తి ఉంచి 25,601 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అండర్-14, 16, 18, 20 బాలబాలికల ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 70 మందికి పైగా అథ్లెట్లు ఎంపికలకు హాజరు కాగా, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎండీ.గౌస్, ఎండీ షఫీక్ అహ్మద్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. అండర్-14 బాలికల విభాగంలో డి.సుమతి(సుబ్లేడు), సీహెచ్ తిరుపతమ్మ, అండర్-16 బాలికల విభాగంలో ఎ.మణుశ్రీ, బి.వైశాలి, రిశివశ్రీ (ఖమ్మం), అండర్-18 బాలికల విభాగంలో డి.బిందు, డి.నవ్య (ఖమ్మం), అండర్-16 బాలుర విభాగంలో ఎన్.హేమంత్(ఖమ్మం), ఎస్‌కే. ముబిన్(తనికెళ్ల), అండర్-18 బాలుర విభాగంలో ఎస్‌కే. ఇఫ్రాన్(నేలకొండపల్లి), జె.అనిల్(పిండిప్రోలు), ఎస్‌కే. అక్సర్(తనికెళ్ల), అండర్-20 బాలుర విభాగంలో బి.విక్రం(మేడేపల్లి) ఎంపికయ్యారని గౌస్ వివరించారు. కార్యక్రమంలో పీడీలు సుధాకర్, రవి, వెంకటేశ్వర్లు, తిరుపతి, ముజాహిద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

సత్తుపల్లిటౌన్/ఖమ్మం అర్బన్/ముదిగొండ : వచ్చేనెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సత్తుపల్లి, మల్లెమడుగు పాఠశాలలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 400 మీటర్ల పరుగుపందెం పోటీల్లో మల్లెమడుగు పాఠశాలకు చెందిన కె.అనిత, సత్తుపల్లి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన సీహెచ్.తిరుపతమ్మ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాగా, జావెలెన్‌త్రో విభాగంలో సత్తుపల్లికి చెందిన జి.ఉమాశ్రీ తృతీయ బహుమతి అందుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆయా విద్యార్థులను సత్తుపల్లి, మల్లెమడుగు పాఠశాలల హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, కృష్ణవేణి, పీడీలు శ్రీదేవి, కృష్ణయ్య తదితరులు అభినందించారు. కాగా, ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన డిగ్రీ విద్యార్థి బొడ్డు విక్రమ్ కూడా 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బియ్యని కృష్ణయ్య తెలిపారు.



సత్తుపల్లి పాఠశాల పీడీ శ్రీదేవితో ఎంపికైన విద్యార్థినులు



మల్లెమడుగు పాఠశాలలో అనితను అభినందిస్తున్న దృశ్యం

సుందర ఖమ్మమే లక్ష్యంగా సాగాలి

- నగరంలో డ్రగ్స్, గంజాయి కనిపించొద్దు
- జర్నలిస్టుల ఇళ్లస్థలాల ప్రక్రియ వేగవంతం చేయండి
- నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్, కమిషనర్‌తో తుమ్మల సమీక్ష



కలెక్టర్, కమిషనర్‌లతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంనగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం ఉండేలా చూడాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలను రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలలను తక్షణమే ఖాళీ చేయించాలని సూచించారు. వాటిని కూల్చివేసి నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అవసరమైన చోట తాత్కాలిక భవనాల్లో పాఠశాలల నిర్వహణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఖమ్మం కార్పొరేషన్‌లో పారిశుద్ధ్యం విషయంలో ఇబ్బందులు ఉన్నాయని, వీటిపై ప్రజల నుంచి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. నగరంలో ఎక్కడా నీరు నిల్వకుండా డ్రైయినేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని చెప్పారు. సారథినగర్ రైల్వే బ్రిడ్జిని సత్వరమే ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రైవేటు స్థలాలను పరిశుభ్రంగా ఉంచేలా యజమానులకు సూచించాలని అన్నారు. సమాజానికి పెనువిపత్తుగా మారిన గంజాయి, డ్రగ్స్ మహమ్మారి ఖమ్మంలో కనిపించకుండా చేయాలన్నారు. జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించి సత్వరమే పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించేలా ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ముస్లిం మత పెద్దలతో చర్చించి ఖమ్మం నగరంలో అవసరమైన చోట ఖబరస్థాన్, షాదీఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రజలకు ఆహ్లాదం పంచేలా చూడాలని అన్నారు. మెయిన్ రోడ్డు నుంచి పార్క్ వరకు రహదారి మంజూరైనందున సత్వరమే నిర్మాణ పనులు చేపట్టాలని చెప్పారు. అర్బన్ పార్క్‌లో ఆహ్లాదం కోసం ఏయే నిర్మాణాలు చేపట్టాలో శాఖల వారీగా నివేదిక తయారుచేయాలని, ఈ పార్క్‌ను ఖమ్మానికి మణిహారంగా తీర్చిదిద్దాలని మంత్రి ఆదేశించారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

- హామీలన్నీ నెరవేర్చబోతున్నాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి : తమ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని పాలేరులో డ్రెయిన్ల నిర్మాణానికి, తురకగూడెం, కిష్టాపురం, చింతలతండా గ్రామాల మధ్య నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ.. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. రానున్న ఐదేళ్లలో అన్ని గ్రామాలకూ రహదారులు, డ్రెయిన్లు నిర్మిస్తామని చెప్పారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు ఇళ్లు, పింఛన్‌లు, రేషన్ కార్డులు త్వరలోనే అందజేస్తామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చబోతున్నామని, ప్రజలకు ఏం కావాలో ప్రభుత్వానికి తెలుసని చెప్పారు. మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత పాటించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు ఉన్న ప్రతి చోట డ్రెయిన్లు నిర్మించి పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. అనంతరం కూసుమంచిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో 37 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, ఆర్డీఓ గణేష్, ఎంపీపీలు బాణోత్ శ్రీనివాస్ నాయక్, బోడ మంగీలాల్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కలెక్టర్

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల తీరుతెన్నులపై మంత్రి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ శాఖ పొలంబాట

లక్ష్మీపురం నుంచి శ్రీకారం చుట్టిన అధికారులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ సురేందర్

ఖమ్మంవ్యవసాయం/ముదిగొండ : రైతులకు మరింతగా చేరువయ్యేందుకు టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు 'విద్యుత్ శాఖ పొలంబాట' కార్యక్రమాన్ని జిల్లాలో ఆదివారం ప్రారంభించారు. విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలం లక్ష్మీపురంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పొలంబాటలో భాగంగా ఒరిగిన స్తంభాలను సరిచేయడం, విరిగిన, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చటం, కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయడం వంటి పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సర్కిల్ ఎస్ఈ ఎ.సురేందర్ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, విద్యుత్ భద్రత సూత్రాలు, విద్యుత్ పొదుపు వంటి అంశాలపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రైతులు విద్యుత్ మోటార్ల వద్ద తగిన కెపాసిటర్లను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ బాబూరావు, ముదిగొండ ఏడీఈ బీంసింగ్, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎప్‌సెట్ పోర్టల్‌లో ఎస్‌బీఐటీకి అటానమస్


ఎస్‌బీఐటీ చైర్మన్ జి.కృష్ణ

ఖమ్మంసహకారనగర్: ఇటీవల యూజీసీ నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు అటానమస్ (పదేళ్ల వరకు) హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా.. దానిని జేఎన్‌టీయూ ఆమోదించింది. దీంతో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఎప్‌సెట్ కౌన్సెలింగ్ పోర్టల్‌లో అటానమస్ హోదాను చూపిస్తుందని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ బుర్రా వెంకటేశం, స్టేట్ కౌన్సిల్ అధికారులు, ఎప్‌సెట్ కన్వీనర్ శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఖమ్మం సహకారనగర్/కల్లూరురూరల్: కల్లూరు మండలం పేరువంచ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు డి.శిరీషపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహిళా సబ్ కమిటీ బాధ్యులు చావా దుర్గాభవాని, షమీ, గీత, నిర్మలకుమారి, సుభాషిణి, జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులను క్రమశిక్షణగా ఉంచేందుకు జుట్టు కత్తిరించే ప్రయత్నం చేశారని, సస్పెండ్ చేయటం సరైన విధానం కాదని పేర్కొన్నారు. కాగా, పేరువంచ హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ విద్యార్థులను శుభ్రంగా ఉంచేందుకు ప్రయత్నించారని, ఆమెపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు డిమాండ్ చేశారు. అలాగే, ఉపాధ్యాయురాలు శిరీషపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీటీఏ) రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హసన్, రామకృష్ణ, పీఆర్టీయూ, టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా సస్పెండ్ సరికాదని తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


గాయపడిన నల్లగొర్ల కృష్ణ

తల్లాడ: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఓ యువకుడు గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సత్తుపల్లి నుంచి వస్తూ స్థానిక బస్టాండ్ లోపలికి వెళ్లింది. తిరిగి బయటకు వచ్చే క్రమంలో అటుగా వెళ్తున్న తెలగవరం గ్రామానికి చెందిన నల్లగొర్ల కృష్ణ బైక్‌ను ఢీకొట్టింది. గాయపడిన కృష్ణను బ్లూకోల్ట్స్ సిబ్బంది ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, కృష్ణ మద్యం సేవించి ఉన్నాడని బస్సు డ్రైవర్, స్థానికులు తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: అన్న మందలించాడని ఓ బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని శంకరగిరితండాకు చెందిన బాలికను తన అన్న ఆడుకుంటున్న సమయంలో మందలించాడు. మనస్తాపం చెందిన బాలిక పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా మండల కేంద్రానికి చెందిన వివాహిత ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దాడి చేసినవారిపై కేసు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో భూ తగాదా విషయమై జరిగిన దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సోదరులు బుల్లెదుల శ్రీరాములు, వెంకటేశ్వర్లుకు భూమి పంపకాల విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం వెంకటేశ్వర్లు, అతని భార్య పూలమ్మ, కుమారుడు ఉదయ్ చేనులో పనులు చేస్తుండగా శ్రీరాములు, అతని కుమారుడు అనిల్, భార్య సుగుణతో పాటు దుంపల ఉపేందర్ మరికొంత మంది దాడి చేసి గాయపర్చారు. తమను చంపుతామని బెదిరంచటమే కాకుండా దాడిని అడ్డుకునేందుకు యత్నించిన మరియమ్మ, ఆమె కుమారుడు రాహుల్‌పై కూడా దాడికి దిగారని బాధితురాలు పూలమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

సుజాతనగర్: మండలంలోని సీతంపేటబంజర శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను సుజాతనగర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో ఎస్ఐ జుబేదాబేగం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకోగా మరికొందరు పారిపోయారు. వారి వద్ద నుంచి రూ.5 వేల నగదుతో పాటు, 5 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

నాలుగు నెలలు నష్టమే..

- వచ్చి పోయే గోదారితో చేలన్నీ నీటిపాలు
- నాలుగు నెలలు ముంపు ప్రాంత రైతులకు తీవ్ర నష్టమే..
- గోదావరి కారిడార్ కదలిక లేక తీరని ఇక్కట్లు


దుమ్ముగూడెం మండలంలోని పత్తి చేలోకి చేరిన వరద నీరు

భద్రాచలం: జీవనదిగా, వర ప్రదాయినిగా పేరుగాంచిన గోదావరి భద్రాచలం ఏజెన్సీ వాసులకు మాత్రం 'కడగండ్ల'ను మిగిలిస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తన ఉగ్ర రూపాన్ని చూపుతూ రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుజేస్తోంది. ఇతర సీజన్‌లలో మేలు చేస్తున్నప్పటికీ ఈ నాలుగు నెలలు భద్రాచలం ఏజెన్సీలోని రైతులు, ప్రజలు దినదినగండంగా గడిపేలా చేస్తుంది. గోదావరి పరివాహక ప్రాంతం తీరం వెంబడి పొలాల్లో ఇసుక, బురద మేటలు వేస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది.

వేల ఎకరాలకు 'కష్ట కాలమే'..

భద్రాచలం నియోజకవర్గ పరిధిలో వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల్లో, ఇక రెండవ ప్రక్క బూర్గంపాడు, పినపాక మండలాల్లో కలిపి వేల ఎకరాలను సాగు చేస్తుంటారు. ఇక్కడ రైతులకు వరి, మిర్చి, ప్రత్తి ప్రధాన ఆధారిత పంట పొలాలు. వరి, మిర్చిలకు నారు పోసి వాటిని నాటేందుకు జూన్ నుంచి సెప్టెంబర్ నెలలు కీలకం. ఇటువంటి కీలక సమయంలో రైతులు వేసిన నారును, పత్తి పంటను గోదావరి వరద తీవ్ర నష్టం చేకూరుస్తోంది. వరి నారును పంట పొలాల్లో ముంచెత్తితే మళ్లీ నారును పోస్తారు. ఆలస్యమైందనుకుంటే డబ్బులు వెచ్చించి బయట ప్రాంతాల్లో వరినారును కొనుగోలు చేయాలి. ఇక కొంత మంది రైతులు మిర్చి నారును పోయడానికి వర్షాకాల సీజన్ దాటి పోయేంత వరకు ఎదురు చూస్తుంటారు. తద్వారా పంట ఆలస్యమవ్వడంతో కాలం అనుకూలించక పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పత్తి పంటతో పాటుగా పొలాల్లో వరద వేసే ఇసుక మేటల వల్ల సైతం రైతులకు కన్నీరు మిగిలుతుంది. రోజుల తరబడి గోదావరి వరద ఉంటే పొలాల్లో ఇసుక మేటలు పేరుకుపోతాయి. వీటిని తొలగించాలంటే రైతులకు తలకు మించిన భారమే. మళ్లీ దుక్కులు దున్నటం నుంచి పని ప్రారంభిచాల్సి ఉండటంతో ఆర్థికంగా భరించటానికి అప్పుల పాలయిన సంఘటనలు ఏజన్సీలో కోకొల్లలు.


వరద ప్రభావంతో పాడైపోయిన పత్తి మొక్కలు (ఫైల్)

గోదావరి రివర్ కారిడార్ ఎక్కడ?

2022 జూలై నెలలో 71.6 అడుగులతో అతి పెద్ద రెండో గోదావరి నీటి ప్రవాహం నమోదై భద్రాచలం ఏజెన్సీని అతలాకుతలం చేసింది. వేలాది ఎకరాలు పంట నీటమునిగి వందలాది మంది నిరాశ్రులయ్యారు. దీనిపై స్పందించి భద్రాచలం ముంపు పర్యటనకు వచ్చిన నాటి సీఎం కేసీఆర్ పలు హామీలను ఇచ్చారు. ఇందులో ప్రధానంగా గోదావరికి రెండు వైపులా ముంపు గ్రామాలను, పొలాలను పరిరక్షించే విధంగా 'గోదావరి రివర్ కారిడార్'ను ఏర్పాటు చేస్తామని, దీనికి కమిటీను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. భద్రాచలం వద్ద నిర్మించిన కరకట్ట మాదిరిగా గోదావరి పరివాహక ప్రాంతంకు ఇరువైపులా కరకట్టల నిర్మాణంతో పాటుగా ఇతర ప్రతిపాదనలను, ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో కమిటీ సభ్యులు సైతం దుమ్ముగూడెం మండలంలో పర్యటించి పోలవరం ముంపు జరిగితే ఉండేన నమోదయ్యే నీటి మట్టం, ముంపు ప్రాంతాలతో పాటు ఇతర అంశాలను నిపుణులైన ఇంజనీర్లు పరిశీలించారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఓటమి చెందటం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ కారిడార్ ముచ్చట అటకెక్కింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ కమిటీ ప్రస్తావన మళ్లీ రాలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అనంతరం భద్రాచలం వద్ద పోటెత్తే గోదావరితో అటువైపున ఉన్న బూర్గంపాడు, పినపాక మండలాలకు ముంపు ప్రభావం బాగా పెరిగింది. మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులు దాటితే రైతులు వరద గురించి ఆరా తీస్తు భయంభయంగా గడుపుతున్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి ముంపు ప్రాంత రైతులకు లాభం చేకూరేలా శాశ్వత చర్యలను, ప్రణాళికలను అమలు చేయాలని వేడుకుంటున్నారు.

నారు మునిగిపోయింది..



ఇటీవల పెసర, ప్రత్తి, జామాయిల్ మొక్కలు వేశా. వేసిన కొద్ది రోజులకే గోదావరి నీరు పంట పొలాల్లో చేరింది. దీంతో అన్ని మొక్కలు చచ్చిపోయాయి. మళ్లీ వరద తగ్గితే ఆ నారు పోసి సాగు చేయాలి. ప్రతి ఏడాది ఇలా తరుచుగా జరగటం వలన అదును కాలంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారు.

– బొల్లి సత్యనారాయణ, రైతు, తూరుబాక

రాయల చంద్రశేఖర్ జీవితం ఆదర్శప్రాయం

- సంస్మరణ సభలో వక్తలు
- నివాళులర్పించిన మంత్రులు


రాయల చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: అట్టడుగు వర్గాల ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసి, అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన రాయల చంద్రశేఖర్ జీవితం ఆదర్శనీయమని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, సహకార, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పోటు రంగారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ రాయల చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోటు రంగారావు మాట్లాడుతూ.. చలాకీగా, చురుకుగా భౌతిక స్థితిలో ఉన్న చంద్రశేఖర్ అకాలమరణం సమాజానికి తీరని లోటన్నారు. సామాజిక శక్తులకు, కమ్యూనిస్టులకు, విప్లవవాదులకు జీవితం చాలా అమూల్యమైనదని, విలువైనదని, అలాంటి విలువైన జీవితాన్ని చివరివరకు ప్రజలకు అంకితం చేసిన వ్యక్తి అని, పోడు భూముల పోరాటానికి నాయకత్వం వహించిన మహనీయుడు చంద్రశేఖర్ అని కొనియాడారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజల తరఫున పోరాడిన చంద్రశేఖర్ ధన్యుడని, ఆయన ఆశయబాటను ఆయన మిత్రులు, సహచరులు అందరూ ముందుకు తీసుకెళ్లేందుకు సహకరించాలన్నారు. మాస్‌లైన్ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కె.రమ అధ్యక్షతన జరిగిన సభలో మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కేజీ రామచందర్, కె.రంగయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమల, న్యూడెమోక్రసీ ఏపీ రాష్ట్ర నాయకులు పోలారి, ధర్మాల సురేశ్, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు చంద్రన్న, గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, ప్రభాకర్, వి.కృష్ణ, సీఎల్సీ రాష్ట్ర బాధ్యులు లక్ష్మణ్, శ్రీమన్నారాయణ, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ఎస్ఎల్ పద్మ, అన్వేశ్, గుర్రం అచ్చయ్య, వి.మనోహర్‌రాజు, ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మూడు క్రిమినల్ చట్టాల రద్దుకు పోరాడుదాం


మాట్లాడుతున్న న్యాయవాది సాధిక్‌అలీ

ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాల రద్దుకు సంఘటితంగా పోరాడుదామని పలువురు వక్తలు తెలిపారు. ఆదివారం ఖమ్మం టీటీడీసీలో వీరనారిమణుల ఆశయ సాధన సమితి జిల్లా గౌరవ అధ్యక్షురాలు షేక్ నజీమా అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయవాది ఎండీ సాధిక్‌అలీ, పిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్ మాట్లాడారు. ఈ నూతన చట్టాలను గతంలో ప్రవేశపెట్టి ఈ ఏడాది అమలు పర్చిందని, బ్రిటీష్ వారు రాజద్రోహం అంటే నేటి పాలకులు దేశద్రోహం అంటున్నారని దుయ్యబట్టారు. సదస్సులో రిటైర్డ్ సీఐ నాగయ్య, వంజాకు లక్ష్మీనారాయణ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోతు భద్రునాయక్, ఉపేంద్రబాయి, జాన్‌బీ, నస్రీన్, జ్యోతి, చందు, త్రివేణి, భవాని, నాగలక్ష్మి, కల్పన, ఉష, శ్రుతి, రమణి, ఝాన్సీ, సంధ్య, సుశీల, సుష్మ, తారాదేవి, వీరన్ననాయక్, నాగేశ్వరరావు, రవీందర్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, రమేశ్‌నాయక్, మహేశ్, రాము, కృష్ణ, మీగడ రామారావు, జగదీశ్, హరి, సురేశ్, లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కనిపించని పులి జాడ

- ఉమ్మడి జిల్లాలో దట్టమైన అడవి లేకపోవడమే కారణం
- మూడేళ్ల క్రితం వచ్చిపోయిన టైగర్

నేడు ప్రపంచ పులుల దినోత్సవం



పాల్వంచరూరల్ : మూడేళ్ల క్రితం జిల్లా అడవిలోకి పులి ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంపై అటవీశాఖ దృష్టి సారించింది. ఆ తర్వాత పులి జాడే లేదు. జిల్లాలో పులి సంచరించేంత దట్టమైన అడవి లేకపోవడం, గుత్తికోయల గుంపులు అధికంగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణమని అటవీ శాఖ గుర్తించింది. మళ్లీ పులి వస్తే తిరిగి వెళ్లకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలనే లక్ష్యంతో అటవీ శాఖ అధికారులు ఉన్నారు. జిల్లాలో 10 లక్షల ఎకరాల్లో అడవులు ఉండగా ఇందులో కిన్నెరసాని అభయారణ్యం విస్తీర్ణం 634.4 చదరపు కిలోమీటర్లు ఉంది. ఆరు డివిజన్లు, 24 రేంజ్‌లు ఉన్నాయి. అటవీ ప్రాంతంలో గొత్తికోయల గ్రామాలు ఏర్పాటు కావడం, రెండు లక్షల ఎకరాల్లో పోడు సాగు చేయడం, లక్ష ఎకరాల్లో అడవిని నరకడం, ఆక్రమణకు గురి కావడంతో అడవులు అంతరించిపోతున్నాయి. దీంతో అడవులు పలచబడి పులులు మనుగడ సాగించలేని పరిస్థితి నెలకొంది. 2018లో జరిగిన పులుల గణనలో ఉమ్మడి జిల్లా అటవీ ప్రాంతంలో ఒక్క పులి జాడ కూడా కనిపించలేదు. చిరుతలు కూడా క్రమంగా కనుమరుగవుతున్నాయి.

అతిథిలా వచ్చి పోతూ..

జిల్లాకు సరిహద్దున ఉన్న ఏటూరునాగారం, ఏపీలోని పాపికొండలు, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాల నుంచి పులులు అప్పుడప్పుడూ అతిథుల్లా ఇటువైపు వస్తున్నాయి. 2020 నవంబర్, 2021 డిసెంబర్, 2022 జనవరి నెలల్లో పెద్ద పులులు జిల్లా అటవీ ప్రాంతంలో సంచరించాయి. ఆ తర్వాత తిరిగి వెళ్లిపోయాయి. కిన్నెరసాని అభయారణ్యం పెద్ద పులుల సంరక్షణ ప్రాంతంగా ఉన్నప్పటికీ ఇక్కడ పులి నివాసం ఉండడం లేదు. ఒకప్పుడు పగిడేరు.రేగళ్ల, అనంతోగు, మల్లేపల్లితోగు, మర్కోడు, ఉలవనూరు ప్రాంతాల్లోని దట్టమైన అడవులు పెద్దపులి నివాసానికి అనువుగా ఉండేవని వైల్డ్‌లైఫ్ అధికారులు అంటున్నారు. దీనికి తోడు ఆహారానికి అవసరమైన దుప్పులు అధికంగా ఉన్నా సాంబార్ వంటి జంతువులు లేకపోవడంతో పులులు ఇక్కడ ఉండలేకపోతున్నాయని చెబుతున్నారు.

పులి ఉండేలా దృష్టి పెట్టాం



జిల్లా అడవుల్లో పులి నివాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పోడుసాగు, అడవుల ఆక్రమణతో అది సంచరించేందుకు అనువైన ప్రాంతం లేదు. ఇప్పుడు మళ్లీ అడవిని విస్తరింప జేసే పనిలో నిమగ్నమయ్యాం. వేటను అరికట్టేందుకు గొత్తికోయ గ్రామాలపై నిఘా పెంచడంతో పాటు వారికి అవగాహన కల్పిస్తున్నాం.

– కృష్ణగౌడ్, జిల్లా అటవీ శాఖాధికారి

రుణం ఇప్పిస్తామని కుచ్చుటోపి

- 300 మందికి పైగా మోసపోయిన వైనం

ఖమ్మంక్రైం: నిరుపేదల అవసరాలను ఆసరాగా చేసుకొని అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని వందల మందికి కుచ్చుటోపి పెట్టి, వారి వద్ద రూ.లక్షలు వసూలు చేసిన వ్యవహారం బయటకు వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన సువర్ణకు, నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఎన్ఎస్టీరోడ్డుకు చెందిన భవానీతో పరిచయం ఏర్పడింది. తేలికగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వారు రూ.6 వేలు చెల్లిస్తే 8 శాతం వడ్డీకి రూ.లక్ష రుణం ఇప్పిస్తామని కొందరు కూలీ పని చేసుకునేవారి వద్ద డబ్బులు వసూలు చేశారు. అలా చైన్ సిస్టం ద్వారా సుమారు 300 మందిని మోసం చేసి, వారి వద్ద నుంచి రూ.లక్షలు వసూలు చేశారు. కానీ, ఎవ్వరికీ రుణం ఇప్పించకపోవడంతో కొందరు భవానీని నిలదీశారు. ఆమె తనకు సంబంధం లేదని ముఖం చాటేసింది. దీంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు భూక్యా సురేశ్ ఫిర్యాదు మేరకు సీఐ బాలకృష్ణ విచారణ చేయగా వ్యవహారం బయట పడింది. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు.. మోసానికి పాల్పడిన ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

శాకంబరిగా పెద్దమ్మతల్లి


శ్రీ కనకదుర్గ దేవస్థానంలోని పెద్దమ్మ తల్లి అమ్మవారిని ఆదివారం శాకంబరీదేవిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలతో తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని బోనాలు, మొక్కులు సమర్పించారు. –పాల్వంచ

గర్భిణికి తప్పని 'జెట్టి' తిప్పలు

- వరద ముంచెత్తడంతో నిలిచిన రాకపోకలు
- మూడు కిలోమీటర్ల మోసుకెళ్లిన కుటుంబసభ్యులు


జెట్టిపై గర్భిణిని మోసుకెళుతూ వాగు దాటుతున్న కుటుంబసభ్యులు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా ఎర్రబోరు గ్రామానికి చెందిన నెలల నిండిన గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు మూడు కిలో మీటర్లు జెట్టిపై మోసుకెళ్లిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఆ రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అటవీ ప్రాంతంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గంలోని వాగులు పొంగి పొర్లుతూ రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కాగా, ఎర్రబోరు గ్రామానికి చెందిన ఓ గిరిజన యువతికి నెలలు నిండి పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు జెట్టిపై మూడు కిలోమీటర్ల మోసుకెళ్లి.. ఆ తర్వాత అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఆదివాసీల గ్రామాలకు నేటికీ సరైన రహదారులు, మౌలిక సదుపాయాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేటీపీఎస్‌లో పట్టాలు తప్పిన కోల్ వ్యాగన్


పట్టాలు తప్పిన వ్యాగన్‌ల దృశ్యం

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో కోల్ వ్యాగన్ శనివారం రాత్రి పట్టాలు తప్పింది. గోదావరి ఖని నుంచి 800 మెగావాట్ల సామర్థ్యం గల 12వ యూనిట్‌కు రెండు వ్యాగన్‌లు, ఒక గార్డ్ బాక్స్‌తో బొగ్గు వచ్చింది. కోల్ యార్డ్‌లో బొగ్గును అన్‌లోడ్ చేసుకుని ఎంటీ వ్యాగన్‌లో తిరిగి వెళ్తున్న క్రమంలో వెనక్కి తీసుకోవడంతో అకస్మాత్తుగా మూడు బోగీలు పట్టాలు తప్పాయి. ఆదివారం ఉదయం రైల్వే అధికారులు కర్మాగారానికి చేరుకుని వాటిని తిరిగి పట్టాలు ఎక్కించడటంతో వ్యాగన్ వెళ్లింది. ఈ విషయమై కోల్ ప్లాంట్ ఎస్ఈ గుర్రం రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా బొగ్గు అన్‌లోడ్ అయి వెళ్లే క్రమంలో పట్టాలు తప్పాయని, భారీ నష్టం ఏమీ లేదని, రిపోర్ట్ తయారు చేశాక సర్వీస్ చార్జీలు ఉంటాయని తెలిపారు.

గుండెపోటుతో ఆయా మృతి


దయమ్మ (ఫైల్)

కల్లూరు: మండలంలోని వెన్నవల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా దయమ్మ (59) ఆదివా రం గుండెపోటుతో మృతి చెందింది. సమాచా రం అందుకున్న సీడీపీఓ ఎస్‌కే మెహర్నిసాభేగం, సూపర్ వైజర్లు దయమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కూలికి వెళ్లి అనంతలోకాలకు..


సైదులు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తిరుమలాయపాలెం: వరి పొలంలో నారు కట్టలు పంచేందుకు వెళ్లి ఓ వ్యక్తి మూర్ఛతో పొలంలోనే పడిపోయి ప్రాణాలు కోల్పోయిన ఘటన మండలంలోని బచ్చోడులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బచ్చోడు గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల సైదులు (42) ఆదివారం ఉదయం గ్రామంలోని ఓ రైతు వరి పొలంలో నారు కట్టలు పంచేందుకు వెళ్లాడు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఆయన వరి పొలంలో మూర్ఛ వచ్చి పడిపోయాడు. అక్కడ ఎవ్వరూ లేకపోవడం ముఖం బురదలో పడిపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య రమణ, కుమార్తె సుజాత, కుమారుడు సురేందర్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

గుండాల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని మోదుగులగూడెం గ్రామానికి చెందిన జబ్బ లక్ష్మయ్య (70) తన కుమారుడు సుధాకర్‌తో కలిసి బైక్‌పై ఇల్లెందు నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. తూరుబాక సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో పడి గేదెల కాపరి...

జూలూరుపాడు: మండలంలోని కరివారిగూడెం గ్రామ సమీపంలోని పెద్దవాగులో మునిగి గేదెల కాపరి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గేదెల కాపరులు రామావత్ వెంకటేశ్వర్లు (63) అలియాస్ చిట్యాల వెంకటేశ్వర్లు, గుగులోత్ బాలు కలిసి ఆదివారం ఉదయం గేదెలను మేపడానికి పెద్దవాగు వైపు వెళ్లారు. గేదెలు మేత మేస్తూ పెద్ద వాగు అవతలి వైపు వెళ్లాయి. దీంతో రామావత్ వెంకటేశ్వర్లు తన బట్టలు, చెప్పులు బాలుకు ఇచ్చి గేదెలను పెద్దవాగు దాటిస్తుండగా నీటమునిగాడు. విషయాన్ని పరిసరాల్లోని రైతులకు బాలు తెలిపాడు. కొందరు యువకులు వాగులో వెంకటేశ్వర్లు కోసం గాలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పెద్దవాగును పరిశీలించి, గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సుమారు నాలుగున్నర గంటలు శ్రమించగా వెంకటేశ్వర్లు మృతదేహం లభించింది. మృతుడికి భార్య సామ్రాజ్యం, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.